క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఆర్.జంబులదిన్నెలోఅభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లోని ఆలయాలకు శనివారం ఉదయాన్నే భక్తులు చేరుకుని పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్యలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

21న జాబ్ మేళా



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. శనివారం జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాలో నాలుగు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఈ జాబ్ మేళాకు పది, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు వారి విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9440224291 నంబరులో సంప్రదించాలని కోరారు.

ముగిసిన త్యాగరాజస్వామి జయంతి వేడుకలు



ఆలయంలో సంగీత కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బాల్కొండ హాల్ వీధిలో వెలసిన త్యాగరాజస్వామి దేవస్థానంలో శనివారం త్యాగరాజస్వామి జయంతి వేడుకలు సంగీత కచేరిలతో ముగిశాయి. స్వామి వారికి ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి అష్టోత్తర శత నామ పూజ చేయించారు. అనంతరం పంచ రత్న సేవా కార్యక్రమం, స్థానిక విద్వాంసులతో సంగీత కచేరీ జరిపించారు. సాయంత్రం టీటీడీ ఆస్థాన విద్వాంసులతో కచేరి, శాస్త్రీయ సంగీత కచేరిలను నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రామాయణం శ్రీనివాసులు, శివ రామకృష్ణ, సురేష్‌బాబు, సాయిరాకేష్, సునిల్‌శర్మ, బాలకొండారెడ్డి, సుధాకర్‌బాబు, పత్తిమోహన్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : మండలంలో ఈ నెల 21 నుంచి నిర్వహించే ప్రత్యేక మొబైల్ ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21, 22 తేదీల్లో ఉయ్యాలవాడ, తుడుమలదిన్నె, 23, 24 తేదీలలో మాయలూరు, సుద్దమల్ల గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తారన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులను ఆయా సచివాలయాల్లో చేసుకోవచ్చన్నారు.

చాబోలు వాసికి ఏఐఐఎంఎస్‌లో 29వ ర్యాంకు



తల్లిదండ్రులతో విజ్ఞాన్ తరుణ్

నంద్యాల(అర్బన్): ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ న్యూఢిల్లీ న్యూరాలజీ కోర్స్‌లో నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన కడియం విజ్ఞాన్ తరుణ్ 29వ ర్యాంకు సాధించారు. గ్రామానికి చెందిన జనార్ధన్, మాణిక్యమ్మ కుమారుడు విజ్ఞాన్‌తరుణ్ న్యూరో డీఎం ఫిజీషియన్ కోర్స్‌లో ఆలిండియా మెడికల్ సైన్సెస్ న్యూఢిల్లీలో ఆలిండియా స్థాయి 29వ ర్యాంకు సాధించారు. విజ్ఞాన్ తరుణ్ స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని శ్రీనవ చైతన్య స్కూల్‌లో 1-10 తరగతి వరకు చదివాడు. పదిలో 565 మార్కులు సాధించాడు. విజయవాడలోని చైతన్య జూనియర్ కాలేజీ 956 మార్కులతో ఇంటర్ పూర్తి చేశాడు. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఎండీ జనరల్ మెడిసిన్‌లో విద్యను అభ్యసించారు. ప్రస్తుతం ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ న్యూరాలజీ కోర్స్‌లో 29వ ర్యాంకు సాధించారు.

అంతా అయ్యాక చేతులెత్తేశారు!

- అటవీ శాఖ అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- నిలిచిన వెదురు సేకరణ
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- జీవనోపాధి కోల్పోయిన పేదలు



నాడు: వెదుర్లతో కళ కలాడుతున్న రుద్రవరం కలప డిపో



నేడు: వెదుర్లు లేక వెలవెలబోతున్న దృశ్యం

రుద్రవరం: ప్రతి సంవత్సరంలాగే అడవిలో వెదుర్లు సేకరించి రుద్రవరం కలప డిపోల్లో వేలం వేయించే ప్రక్రియ కొనసాగించాలని ఉన్నతాధికారులు స్థానిక అధికారులను ఆదేశించారు. అలాగే టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు తేదీని కూడా ప్రకటించారు. అయితే మొదట అలాగే అంటూ తలూపిన స్థానిక అధికారులు పలు కారణాల వల్ల తాము ఆ ప్రక్రియ నడిపించలేమని చేతులెత్తేయడంతో వెదురు సేకరణ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఎంతో ఆశగా ఉన్న పేదలు తమకు జీవనోపాధి లేకుండా పోయిందని విలవిల్లాడుతున్నారు. అధికారుల నిర్వాకంతో పేదలకు జీవనోపాధితో పాటు ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోంది.

వెదురుకు మంచి గిరాకీ..

నల్లమల అడవిలో ప్రకృతి వనరుగా పేరు గాంచిన వెదురుకు స్థానికంతో పాటు ఇతర ప్రాంతాల్లో మంచి గిరాకి. దీంతో రుద్రవరం, చెలిమరేంజిల్లో నుంచి వెదుర్లను సేకరించి రుద్రవరం, గాజులపల్లె కలప డిపోలకు తరలించి నెలలో రెండు మార్లు వేలం నిర్వహించేవారు. వేలం ప్రక్రియ పూర్తి కాగానే కాంట్రాక్టర్లు ఆ వెదుర్లను ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించేవారు. వేలం ద్వారా ఏడాదికి ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వచ్చేది. అలా వెదురు సేకరణ, వేలం ప్రక్రియతో నాడు కలకలలాడిన కలప డిపోలు నేడు వెలబోతున్నాయి.

ఏటా 8 నెలల పాటు వెదుర్ల సేకరణ..

ప్రతి ఏటా సెప్టెంబర్ నెల రాగానే అటవీ శాఖ ఉన్నతాధికారులు వెదురు సేకరణను ప్రారంభించాలని ఆయా రేంజి అధికారులను ఆదేశిస్తారు. అక్టోబర్ నెలలో టెండర్ ప్రక్రియ నిర్వహించి వెదురు సేకరణ ప్రారంభించేవారు. దాదాపు 8నెలల పాటు వెదురు సేకరణ, రవాణా, గ్రేడింగ్ వంటి పనులు సాగేవి. ప్రతి ఏడులాగే ఈ ఏడాది ఆ ప్రక్రియ చేపట్టాలని ఉన్నతాధికారులు స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక అధికారులు రుద్రవరం రేంజిలోని సిల్లమానుపెంట, అహోబిలం, ఎంఎం చెలిమ, గొర్రెగుంత అనే నాలుగు కూపుల్లో ప్లాట్లు వేసి దాదాపు 2లక్షల వెదురు లభ్యత ఉందని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ మేరకు వారు ఈనెల 8న టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తేదీని ఖరారు చేశారు. దీంతో పలువురు కాంట్రాక్టర్లు వెదురు సేకరణ, అడవిలో నుంచి కలప డిపోకు తరలింపు, డిపోలో గ్రేడింగ్ చేయడం వంటి మూడు పనులకు టెండర్ల కోసం బ్యాంకుల్లో డబ్బులు చెల్లించి డీడీలు కూడా తీశారు.

> డీడీలు తీసుకున్న కాంట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు నంద్యాల అటవీ శాఖ కార్యాలయం వద్దకు వెళ్లగా టెండర్ ప్రక్రియను రద్దు చేసినట్లు ఉన్నతాధికారులు
>
> **నిలిచిన టెండర్ ప్రక్రియ**
>
> ప్రకటించారు. ఇదేమని కాంట్రాక్టర్లు ఆరా తీయగా అక్కడి స్థానిక అధికారులు వెదురు వేలం ప్రక్రియ సాగించలేమని చెప్పడంతో నిలిపేసినట్లు తెలిపారు.

జీవనోపాధి కోల్పోయిన కూలీలు

వెదురు వేలం నిలిచి పోవడంతో ఎంతో మంది కూలీలకు జీవనోపాధి లేకుండా పోయింది. అక్టోబర్ నెల రాగానే రుద్రవరం, గాజులపల్లె, పచ్చర్ల, దొరకొట్టాల తదితర గ్రామాలతో పాటు ఒరిస్సా నుంచి కూలీలు వచ్చేవారు. అడవిలో వెదురు సేకరణ మొదలు డిపోకు తరలించడం, అక్కడ గ్రేడింగ్ చేయడం, వాటిని తిరిగి లారీలకు లోడింగ్ చేయడం ఇతర ప్రాంతాల్లో దించడం వరకు ఎంతో మంది కూలీలకు జీవనోపాధి ఉండేది. అలా అందుబాటులోకి వచ్చిన వెదుర్లతో బుట్టలు, తడికెలు, విసనకర్రలు, ఇలా అల్లే వారికి ఉపాధి ఉండేది. ప్రస్తుతం వెదురు సేకరణ నిలిచి పోవడంతో అందరు పనుల్లేక విలావిల్లాడుతున్నారు.

ఉన్నతాధికారులే ఆపేశారు



షాంపుల్ ప్లాట్లు వేసినందుకు కాంట్రాక్టర్‌కు సొమ్ము చెల్లించాల్సిన విషయం వాస్తవమే. అలాగే వెదురు సేకరణ, వేలం నిలిపేసింది ఉన్నతాధికారులే. రేంజి పరిస్థితిపై ఉన్నతాధికారులు అడగ్గా పులుల సంఖ్య పెరింగిందని తెలియ జేయడంతో వెదురు సేకరణ, వేలం వంటి వాటిని నిలిపివేశారు.
– శ్రీపతినాయుడు,రుద్రవరం రేంజి అధికారి

నా డబ్బులు ఇప్పించండి



రుద్రవరం రేంజి అధికారులు నన్ను మోసం చేశారు. అడవిలో వెదురు సేకరణకు సంబంధించి షాంపుల్ ప్లాట్లు వేయించినందుకు రూ.3లక్షల దాకా ఖర్చు అయ్యింది. ప్రభుత్వం నుంచి ప్రత్యేక బడ్జెట్ ఉన్నప్పటికి ఆ సొమ్మును నాతోనే ఖర్చు చేయించారు. ఇప్పుడు వెదురు వేలం నిలిచి పోయింది. వేలం జరిగివుంటే నా పెట్టుబడి తిరిగి వచ్చేది. ఉన్నతాధికారులు స్పందించి నా సొమ్ము ఇప్పించాలి. – **రమేష్, వెదురు కాంట్రాక్టర్**

పండుగలు కూడా చేసుకోలేక పోయాం



వెదురు సేకరణ అనగానే నాతో పాటు మరి కొంత మందిని అడవికి తీసుకెళ్లి పనులు చేసుకునేవాళ్లం. రోజు రూ.500ల నుంచి రూ.వెయ్యి వరకు సంపాదించే వారం. కూలీ సొమ్ము చేతికి వస్తుండటంతో అందరు సంతోషంగా ఉండే వాళ్లం. జీవనం సవ్యంగా సాగేది. అయితే ఈ ఏడాది వెదురు సేకరణ నిలిపివేయడంతో తాము జీవనోపాధి కోల్పోయాం. దీంతో క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలు కూడా చేసుకోలేక పోయాం. వెదురు వేలాలు కొనసాగించలి పేదలకు జీవనోపాధి కల్పించాలి. – **శీను,కూలీల మేస్త్రీ**

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల(అర్బన్): ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. స్థానిక కార్యాలయంలో డీఆర్‌ఓ రాము నాయక్, పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటసుబ్బారెడ్డితో కలిసి ఉచిత పశువైద్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ శిబిరాల్లో పశు గర్భకోశ వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉంటాయని చెప్పారు. దీంతో పాటు పశు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారని, ప్రతి పాడి రైతులు శిబిరాల్లో పాల్గొని పశు సంపదపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

పాడి రైతునే ‘విజయ’ చైర్మన్‌గా నియమించాలి



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): పాడిని పోషిస్తున్న వారినే విజయ డెయిరీకి చైర్మన్‌గా నియమించాలని, ఇతర సామాజిక వర్గాలకు ఒక్కసారైనా అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగ నాయుడు, కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్, కాంగ్రెస్ పార్టీ నంద్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా కుటుంబ పాలనలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కోరారు. విజయ డెయిరీ పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీలకు చైర్మన్ పదవి దక్కలేదని, ఇప్పటికైనా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రైతు సంఘం కార్యదర్శి సోమన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

25న దివ్యాంగుల క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 25వ తేదీన ఎన్‌జీఓ కాలనీలోని గురురాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాల క్రీడా మైదానంలో దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికృష్ణ, రమణయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈనెల 30వ తేదీన గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడా పోటీల్లో 100, 200, 400, 1500 మీటర్ల పరుగు పందేలు, హైజంప్, లాంగ్ జంప్, జావెలిన్, షాట్‌పుట్, త్రోబాల్, డిస్కస్‌త్రో పాటు పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శారీరక, మానసిక, కంటి చూపు, మరుగుజ్జు దివ్యాంగులు పోటీల్లో పాల్గొంటారన్నారు. ఉపాధ్యక్షులు బాబాఫకృద్దీన్, సంయుక్త కార్యదర్శి మధుకుమార్, ఆల మధు, వెంకటరావు, కల్యాణి, వీరభరతుడు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఎల్‌ఐసీ జాతీయాకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని ఈనెల 20వ తేదీన చేపట్టిన బిగ్ బిజినెస్ డేను జయప్రదం చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శుక్లా, కార్యదర్శి రమేష్‌బాబు కోరారు. శనివారం ఎల్‌ఐసీ జాతీయాకరణ పూర్తయి 69 సంవత్సరాలైన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్‌ఐసీని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌ఐసీ సంస్థకు 14లక్షల మంది ఏజెంట్లు ఉన్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఆర్ఎస్ రంగాపురం వీఓఏ లక్ష్మి ఆత్మహత్యాయత్నానికి కారకులైన బేతంచెర్ల వెలుగు ఏపీఎం మధుసుదర్శన్‌గౌడ్, వెలుగు సీసీ రాజేశ్వరి గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, సహాయ కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో పొదుపు సంఘాల బుక్ కీపర్‌గా (వీఓఏ)గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మిని ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఉద్యోగం నుంచి తొలగించడంతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి గురై విషద్రావణాన్ని తాగి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఆపాలని, నిబంధనలను అతిక్రమించిన అధికారులను అరెస్ట్ చేయాలని కోరారు.

ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం

నంద్యాల(వ్యవసాయం): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడం హర్షించదగ్గ విషయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తూము శివారెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవమూర్తులకు విశేష పూజలు



కృష్ణాపురంలో ఊరేగుతున్న ఉత్సవ పల్లకీ

ఆళ్లగడ్డ : శ్రీ అహోబిలేశుడి పారువేట మహోత్సవాల్లో భాగంగా స్వామి పల్లకీ రూరల్ మండలం ఆర్.కృష్ణాపురంలో కొలువుదీరింది. గ్రామానికి చేరుకున్న శ్రీజ్వాలన్నృసింహ స్వామి, ప్రహ్లాదవరదస్వాముల ఉత్సవ పల్లకీ శుక్రవారం రాత్రి గ్రామానికి చేరుకుని పొలిమేర తెలుపుపై కొలువుదీరింది. శనివారం ఉదయం గ్రామపెద్దల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా నైవేద్యం తీసుకెళ్లి ఉత్సవ మూర్తులకు నివేదించారు. అనంతరం గ్రామస్తులు పల్లకీని భుజాలపై మోసుకుంటూ గ్రామంలోని తెలుపులపై కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి రాకతో గ్రామంలో తిరునాల వాతవరణం నెలకొంది. కుల, మతాలకు అతీతంగా స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఉత్సవ పల్లకీ ఆదివారం ఉదయం కోటకందుకూరు గ్రామానికి చేరుకుంటుంది.

పోస్టులను భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

నంద్యాల(న్యూటౌన్): వాహనాల డ్రైవర్లు, చోదకులు కంటిచూపు సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని జిల్లా రవాణాశాఖాధికారి ఐశ్వర్యరెడ్డి అన్నారు. శనివారం నంద్యాల రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు డీటీఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. నంద్యాల లారీ అసోసియేషన్ డ్రైవర్లు, ఇతర వాహన చోదకులకు శాంతిరాం మెడికల్ కళాశాల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

ఆళ్లగడ్డ : త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక గాయత్రీ మాత ఆలయంలో త్యాగరాజస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి చిత్రపటంతో ఊరేగింపుగా నాలుగు రోడ్లకూడలి వరకు చేరుకుని తిరిగి దేవాలయం వరకు భిక్షాటన కార్యక్రమం చేపట్టారు.

బ్యాడ్మింటన్,షటిల్ పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లాల బ్యాడ్మింటన్, షటిల్ డబుల్స్, మిక్స్‌డ్ ట్రిపుల్ టోర్నమెంట్ పోటీలను శాంతిరాం విద్యాసంస్థల డైరెక్టర్ మిద్దెశివరాం ప్రారంభించారు. 19వ తేదీన 40 సంవత్సరాలు పైబడిన వారికి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ కన్వీనర్‌ఖాన్, అధ్యక్షుడు ఆదినారాయణ, స్పోర్ట్స్ సెక్రటరీ కాంతారెడ్డి, సీవీరెడ్డి, శివ, మోహన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు కృషి చేయాలి



గోస్పాడులో చెత్తను తొలగిస్తున్న జేసీ విష్ణుచరణ్,



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ, అధికారులు

గోస్పాడు: వ్యక్తిగత పరిశుభ్రతను పాటించినట్లుగానే ప్రతిఒక్కరూ పరసరాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల మూడో శనివారం విధిగా కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ ప్రమీల, ఎంపీడీఓ అమానుల్లా, తహసీల్దార్ షేక్ మొహిద్దీన్, ఈఓఆర్డీ నాగఅనసూయ, డాక్టర్ గోపాల్, ఏపీఓ నాగజ్యోతి, పీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు అదనంగా ఇవ్వొద్దు

నంద్యాల(అర్బన్): గ్యాస్ సిలిండర్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించాలని, డెలివరీ బాయ్స్‌కు అదనంగా ఇవ్వొద్దని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎల్‌పీజీ కస్టమర్ల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారని సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు అందాయన్నారు. అదనపు చార్జీలు అడిగితే జిల్లా పౌరసరఫరాల అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అయ్యలూరు గ్రామంలో శనివారం తహసీల్దార్లు ప్రియదర్శిణి, శ్రీనివాసులతో పాటు ఎంపీడీఓ సుగుణశ్రీ, తదితర మండల అధికారులతో కలిసి గ్రామ వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు.

శుభ్రతతో ఆరోగ్యాంధ్ర



శిరివెళ్లలో ర్యాలీ చేస్తున్న అధికారులు

శిరివెళ్ల: పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యమని ఉపాధి హామీ పథకం పీడీ జనార్దన్‌రావు అన్నారు. శనివారం మండలంలో జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల కేంద్రం శిరివెళ్లలో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి 3వ శనివారం విధిగా ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యాలయాలు, పాఠశాలలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏంపీడీఓ శివమల్లేశ్వరప్ప, తహసీల్దార్ పుష్పకుమారి, మాజీ జెడ్పీటీసీ యామా గుర్రప్ప, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దొర్నిపాడు: ప్రభుత్వ కార్యాలయాల వద్దనే కాకుండా ఎవరి ఇళ్ల వద్ద వారు పరిశుభ్రంగా ఉంచుకునేలా సర్పంచులు, కార్యదర్శులు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్నీ ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు బాలయ్య, శివరామిరెడ్డి, మాధవీలత, మాధవీ, దేవమణి, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు


రుద్రవరం: ప్లాస్టిక్ వినియోగించవద్దని, అలాగే చెత్త ఎక్కడ బడితే అక్కడ వేయ వద్దని ఉద్యానవన, మండల ప్రత్యేక అధికారి నాగరాజు ప్రజలకు సూచించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. రుద్రవరంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, వివిధ శాఖల అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్‌ను వాడవద్దని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అప్పనపల్లె దారిలోని డంప్ యార్డువద్ద రోడ్డుపై చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

చాగలమర్రిలో స్వచ్ఛ దివస్

చాగలమర్రి: మండల కేంద్రంలో శనివారం ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి పి.ముస్తాక్ అహ్మద్ హాజరయ్యారు. ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని తెలుగంగ కాలనీ నుంచి చర్చి వరకు రోడ్డుకు ఇరువైపుల జంగిల్ క్లీయరెన్స్, 5వ సచివాలయం సమీపంలోని 10, 11 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పరిసరాలను శుభ్రం చేశారు.

ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత

ఉయ్యాలవాడ : స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, వివిధ శాఖల అధికారులు ప్రతిజ్ఞ చేశారు.



భాగ్యనగరంలో ఊరంతా పూతతో కనిపిస్తున్న మామిడిచెట్లు

ఊరంతా చెట్లు.. చెట్ల నిండా పూత



రామచంద్రాపురంలో ఓ ఇంటి వద్ద చెట్టునిండా పూతతో మామిడి చెట్టు

దొర్నిపాడు: మా మామిడి చెట్టు పూత కొంచ్చిందని ఒకరంటే.. మా చెట్టుకు ఏకంగా పింజలే వచ్చాయని మరొకరు.. గ్రామీణ ప్రజలు ఇలా మాట్లాడుతుంటే అప్పుడే మామిడి మాధుర్యం నోరూరించేలా కనువిందు చేస్తున్నాయి. మండంలోని భాగ్యనగరం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, వెంకటేశ్వరనగరం గ్రామాల్లో ఇంటికో మామిడి చెట్టు ఉంది. దీంతో ఎక్కడ చూసినా ఊరంతా ఫలరాజుచెట్లే కనిపిస్తాయి. ప్రస్తుతం ఏ చెట్టుకు చూసినా ఎన్నడూ లేని విధంగా పూత పూయడంతో చెట్టునిండా మామిడి పండ్లు కాసేలా ఉన్నాయని సంబర పడుతున్నారు. గతేడాది ఇంతటి పూత రాలేదని ఆయాగ్రామాల ప్రజలు చెబుతున్నారు.

799 పక్కా గృహాలు పూర్తి

శిరివెళ్ల: మండలంలో 799 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ అహమ్మద్‌బాషా శనివారం తెలిపారు. మండలానికి 1,583 ఇళ్లు మంజూరయ్యాయని, అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 28 ఇళ్లు 90 శాతం, 21 ఇళ్లు 85 శాతం నిర్మాణాలు జరిగాయన్నారు. మరో 304 ఇళ్ల నిర్మాణాలు పునాది స్థాయిలో ఉన్నాయన్నారు. ఈ ఏడాడి మార్చి నాటికి వంద శాతం ఇళ్ల నిర్మాణాలు జరగాలన్నది లక్ష్యమన్నారు.